


పోస్టుల భర్తీకి 27న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్

రాజమహేంద్రవరం : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం లోని కొంతమూరు గ్రామం నందుగల ఎస్తేర్ ఆక్సిన్ రెసిడెన్షియల్ ఎయిడెడ్, ఎలిమెంటరీ అండ్ హైస్కూల్లో ఖాళీగా ఉన్న ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ ఎయిడెడ్ పోస్టుల భర్తీకి ఎపి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని డిఇఒ కె.వాసుదేవరావు తెలపారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27నకంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు.కాకినాడ జిల్లా అచ్యుతాపురంలోని అయాన్ డిజిటల్ జోన్, రాజమహేంద్రవరం లూదర్ గిరిలోని రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ పరీక్ష జరుగుతుదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువపత్రంతో గంట ముందుగా హాజరు కావాలన్నారు. సందేహాల నివృత్తికి 9848574622, 8309177952 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గాలి దుమారం

- సుడిగాలికి ఇళ్లు ధ్వంసం
- విరిగిన పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో వేలచింతలగూడెం
- నిరాశ్రయులకు కమ్యూనిటీహాల్లో ఆశ్రయం

ప్రజాశక్తి - గోపాలపురం

సుడిగాలికి వేలచింతలగూడెం గ్రామం చిగురుటాకులా వణికింది. ఈదురుగాలి విరుచుకుపడటంతో అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. దీంతో గ్రామంలో అంధకారం అలముకుంది. పలు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

మండలంలోని వేలచింతలగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో భారీ గాలి దుమ్ము విరుచుకు పడింది. గ్రామంలోని దళితులు నివసిస్తున్న కొత్త పేట కమ్యూనిటీ హాల్ సమీపంలో ఐదు నిమిషాల పాటు గాలి దుమారం బీభత్సం సృష్టించింది. గాలి తీవ్రతకు పలు పెంకుటిల్లు, రేకుల షెడ్డులు పై కప్పులు గాలికి ఎగిరిపోయాయి.. ప్రహరీ గోడలు పడిపోయాయి. సుమారు 40 చెట్ల వరకూ పడిపోయాయి. 10కి పైగా విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. ఐదు నిమిషాల్లో ఏం జరిగిందో తెలిసే లోపే ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడం, పెంకులు విరిగిపడటంతో ప్రజలు ప్రాణభయంతో భీతిల్లారు. కట్టు బట్టలతో పిల్లాపాపలతో రోడ్డున పడ్డారు. పూర్తిస్థాయిలో ఎంత నష్టం వాటిలిందో ఇంకా తెలియాల్సి ఉంది... విద్యుత్ శాఖ ఎడిఇ రవిశంకర్ విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. చెట్లు పూర్తిగా తొలగించిన తరువాతనే విద్యుత్, స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేసే వీలుంటుందని వారు తెలిపారు.



బాధితులు అందరూ నిరుపేద, సామాన్య మధ్యతరగతి ప్రజలే. ఒకపక్క అల్ప పీడన ప్రభావంతో నాలుగు రోజులుగా ఎడ తెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. వర్షం నుంచి గట్టెక్కడానికి వారు నానా తంటాలు పడుతున్నారు. అనుకోకుండా ఒక్కసారిగా వచ్చిన ఈ ఉపద్రవంతో వారు ఇంకా షాక్‌లోనే ఉన్నారు. పిల్లాపాపలను తీసుకుని సమీపంలోని తెలిసిన వారింటికి, దేవాలయాల్లో తలదాచుకుంటున్నారు. ఇంటిపైకప్పులు లేకపోవడంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా వర్షానికి తడిసి ముద్దయ్యింది.





సహాయక చర్యలు చేపడుతున్నాం

గాలి దుమారానికి మూడు ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలియగానే విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బందిని ఘటనా ప్రాంతానికి తరలించాము. వారు సహాయక చర్యలు చేపడుతున్నారు. నిర్వాసితులకు స్థానిక కమ్యూనిటీ హాల్లో పునరావాసం కల్పించాం. బాధితులకు ఆహారం అందిస్తున్నాం. నష్టం ఎంత అనేది ఇంకా తెలియలేదు. రేపటి లోగా పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనా వేస్తాం. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటాం.

- కె.అజయ్‌బాబు, తహశీల్దార్

ప్లాస్టిక్ రహిత జిల్లాకు చర్యలు

కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం క్షేత్ర స్థాయి అధికారులకు ఈ మేరకు ఆమె దిశా నిర్దేశనం చేశారు. జిల్లాలోని అన్ని డివిజన్లు, మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయి వరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగం వల్ల పర్యావరణానికి సంబంధించి జరిగే అనర్థాలను వివరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమన్వయంతో విస్తృత స్థాయిలో దాడులు, తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వ్యాపారులు, చిన్న స్థాయి విక్రయదారుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన కల్పించినా మార్పు దిశగా చర్యలు తీసుకొని వారి విషయంలో అవసరమైతే కేసులు నమోదు చేయాలని ఆమె స్పష్టం చేశారు.

సమాజంలో అన్ని వర్గాల ప్రజలలో చైతన్యం కలిగించేలా స్కూల్‌లు, కాలేజీల్లో విద్యార్థులతో పోటీలు, ర్యాలీలు, డిజిటల్ పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారాలతో కూడిన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కాటన్ బ్యాగుల వినియోగం పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలతో కలసి మండలాల్లో "కాటన్ బ్యాగ్ విపణి"లను ఏర్పాటు చేయాలన్నారు. "సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు గుడ్ బై-కాటన్ బ్యాగ్ వినియోగం మన భవిష్యత్తుకు భరోసా" విధానంలో గ్రామ పంచాయతీ స్థాయి వరకు ప్రచారం చేయాలన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న అడిషన్ కమిషనర్ రామలింగేశ్వర్

పకడ్బందీగా పారిశుధ్య పనులు

అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ప్రతి వార్డులో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని అడిషినల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆనంద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. 46వ వార్డులోని పలు వీధుల్లో శానిటేషన్, సైడ్ డ్రెయిన్ల నిర్వహణా విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటానికి వీల్లేదన్నారు. చెత్తా చెదారంతో పాటు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. నగరంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నగర పాలక సంస్థ ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం పంచుకుంటేనే నగరం మరింత సుందరీకరణ దిశగా అడుగులు వేస్తుందన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందించాలని ఆర్‌డిఒ కృష్ణనాయక్, జిల్లా సరఫరా అధికారి వి.పార్వతి రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ కృష్ణనాయక్ మాట్లాడుతూ డీలర్లు ప్రతి రోజూ నిర్ణీత సమయాల్లో హాజరై, క్రమబద్ధంగా సరుకులు పంపిణీ జరగేలా చూడాలన్నారు. సరుకుల పంపిణీపై ప్రభుత్వం ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి వి.పార్వతి మాట్లాడుతూ ప్రతి డీలర్ తప్పనిసరిగా ఉదయం 7:30 గంటలకల్లా లాగిన్ అవ్వాలని, రేషన్ షాపులు ఈ సమయాల్లో తెరిచి ఉంచాలన్నారు. ఉదయం: 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం: 4 నుంచి 8 గంటల వరకు షాప్ తెరిచి ఉంచాలన్నారు. రేషన్ పంపిణీ ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ లోపు పూర్తిగా జరగాలన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, వికాలాంగులకి ప్రతి నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ లోపు ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. డీలర్లు ఈ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఎస్‌ఒ నాగమల్లేశ్వరరావు, ఇతర అధికారులు, రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే జరిమానా

ప్రజాశక్తి-గోకవరం

ప్రభుత్వం నిషేదించిన ప్లాస్టిక్ వస్తువులను అమ్మినా, వినియోగించినా రోజుకు రూ.2,500 జరిమానా విధిస్తామని ఎంపిడిఒ ఎం.గోవింద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకలెక్టర్ ఆదేశాలు మేరకు పంచాయతీలు, సచివాలయాల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (75 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్నవి) కవర్లు, స్ట్రాలు, ప్లాస్టిక్ స్పూన్లు, ప్లాస్టిక్ ప్లేట్లు తదితర ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదన్నారు. ఇప్పటికే ఈ మేరకు అన్ని షాపులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఈ మేరకు షాపనులకు నోటీసులు జారీ చేశారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజల చెంతకు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -కొవ్వూరు

క్షేత్రస్థాయి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో శుక్రవారం మూడు నాలుగు వార్డుల్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ఆయా శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, వరిగేటి లలిత కుమారి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల సరిహద్దు పనులు పూర్తి చేయాలి

భూ పరిపాలన అదనపు సిసిఎల్ఎ ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అన్ని ప్రభుత్వ భూముల సర్వే, గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పనులను వెంటనే పూర్తి చేయాలని భూ పరిపాలన అదనపు సిసిఎల్ఎ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, రీ సర్వేపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్టాలపై తహశీల్దార్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్వీస్ ఇనాం భూములను సంస్థాగత, వ్యక్తిగత అనే రెండు విభాగాలుగా వర్గీకరించారని చెప్పారు. సంస్థాగత ఇనాం భూమికి అనుభవదారు యజమాని కాదని, దానికి సంబంధిత సంస్థే యజమాని అని చెప్పారు. వీటిని 22ఎ(1)(సి)లో చూపాలన్నారు. ఆర్టిజన్ ఇనాలు, వ్యక్తిగత ఇనాంల విభాగంలోకి వస్తాయని, వీటిని ఫ్రీ హోల్డ్ చేయమని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు.

సర్వే, మ్యుటేషన్ సమయంలో నోటీసులు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలన్నారు. తప్పనిసరిగా నోటీసులు అందేలా చూడాలన్నారు. నోటీసులు అందినట్టు ఆధారాలు చూపకుంటే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామసభలు నిర్వహించిన తర్వాత కూడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయో పరిశీలించాలని చెప్పారు. రీ సర్వే డిటి, విఆర్‌ఒలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే పూర్తయిన చోట రికార్డులను మరోసారి వెరిఫై చేయాలని చెప్పారు. సరిహద్దులు మారితే దానికి గల కారణాలు నమోదు చేయాలన్నారు. అంతిమ భూ రికార్డు (ఫైనల్ ల్యాండ్ రికార్డ్ ఎఫ్ ఎల్ ఆర్) రూపొందించిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యలన్నిటిని పరిష్కరించి వివాదం లేని గ్రామం (డిస్ప్యూట్ ఫ్రీ విలేజ్) గా ప్రకటించాలని సూచించారు. రెండవ ఫేజ్‌లో ప్రజల సంతృప్తి స్థాయి బాగా పెరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పనితీరును ప్రశంసించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు మూడు రోజులపాటు రీ సర్వే జరుగుతున్న గ్రామంలో ఉండాలని ఆదేశాలిచ్చామన్నారు. గ్రామ కంఠాలను 22ఎ నుంచి తొలగించి ఫ్రీ హోల్డ్ చేసినట్లు చెప్పారు. నల్లజర్ల, గోపాలపురం, బిక్కవోలు, రాజమండ్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భూ సమస్యలు, పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులు అధికంగా వస్తున్నట్లు చెప్పారు. భూ ఆక్రమణలుగా చెబుతున్న వాటిలో అధిక భాగం కుటుంబ వివాదాల్లో, సివిల్ వివాదాల్లో ఉన్న భూములేనని చెప్పారు. నోటీసు ఇవ్వడం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో, నోటీసు అందచేసినట్టుగా ఇతరుల నుంచి సాక్షి సంతకాలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, ఆర్‌డిఒలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణనాయక్, సర్వే శాఖ సహాయ సంచాలకులు బి.లక్ష్మీనారాయణ, తహశీల్దార్లు, సర్వే ఇన్‌స్పెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ఐఎల్‌టిడి సెంటర్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో కరెంట్ హౌస్ వైరింగ్, ఫొటో అండ్ వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ శిక్షణ 30 రోజులపాటు ఉంటుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులకు మాత్రేమ శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాల 0883-2420242,2428807, 9014328803, 9701359954 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను తహశీల్దార్ నిరంజన్, ఎంపిడిఒ పద్మజ శుక్రవారం పరిశీలించారు. మురుగునీటి బోదెలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. పొలాల నుంచి ముంపు నీరు దిగేలా, చెరువల్లో చెత్తా చెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

తాళ్లపూడి : అన్నదేవరపేట మండల ప్రజా పరిషత్ మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి వివిధ గ్రామాలకు ఇటీవల బదిలీపై వెళ్లిన జి.రామచంద్రరావు, జెడి.సునీత, సిహెచ్.మహేష్, జి.రవికుమార్‌లను విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలతో పాటు విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అత్యుత్తమ ర్యాంకులతో ఉన్నత శిఖరాలకు చేరుకుని పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జిడివికె.ప్రసాద్, ఉపాధ్యాయులు జి.రాజారత్నం, కె.ప్రసన్న కుమార్, బి.శంకర్, ఈ.సత్యనారాయణ, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్‌గా పిల్లి కాంతారావు

ప్రజాశక్తి-నల్లజర్ల

బి అండ్‌జి హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ తూర్పుగోదావరి జిల్లా వైస్ చైర్మన్‌గా పిల్లి కాంతారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పిల్లి కాంతారావు మాట్లాడుతూ ముందుగా తనపై నమ్మకంతో తనను ఈ పదవిలో నియమించిన బి అండ్‌జి హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు నేషనల్ ఫౌండర్ గుండారెడ్డి మల్లికార్జున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అవినీతి నిర్మూలన పోరాడతానన్నారు. తన నియామకానికి సహకరించిన నేషనల్ డైరెక్టర్ భయపనేని వెంకటేశ్వర్లు తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ తుపాకుల వెంకన్న బాబు, ఏలూరు జిల్లా చైర్మన్ కొండ రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు

కొవ్వూరు : పంటలకు అధిక మోతాదులో ఎరువులు వాడడం శ్రేయస్కరం కాదని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలకు లోబడి ఎరువులను వాడాలని ఎడి సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు శ్రీరామ సొసైటీ వద్ద శుక్రవారం రైతులకు ఎరువుల వాడకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అధిక ఎరువులు వాడకం కారణంగా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పలువులు రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం.వెంకటరమణ మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్ రావు, సొసైటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి -కొవ్వూరు


నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కరించేందు కుగాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో పదమూడు వినతులు అందాయన్నారు. వీటిలో ప్రధానంగా తల్లికి వందనం డబ్బులు పడలేదని, వితంతు పింఛనులు ఇప్పించాలని, రోడ్లు వేయాలని, మంచినీటి కుళాయిలు ఇప్పించాలని, రెవెన్యూ సమస్యలు, క్యాస్ట్ సర్టిఫికెట్‌లో క్యాస్ట్ మారిందని సరిచేయించాలని కోరుతూ కోరుతూ వినతి పత్రాలు అందజేశారన్నారు. వీటిని ఆయ శాఖల అదికారులకు పంపించామని తెలిపారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామని ఎంఎల్ఎ తెలిపారు.

బ్యాంకు సేవలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వేమగిరిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్స్ ఎడ్యుకేషన్, అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌బిఐ జిఎం ఎ.మహాన హాజరై మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పిఎం జన్‌ధన్ ఖాతాలు, రూపే ఎటిఎం కార్డు, నామినేషన్ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ రత్న కుమారి మాట్లాడుతూ జన సురక్ష కార్యక్రమంలో సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనలో నమోదు చేయించుకోవాలన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలన్నారు. అలాగే బ్యాంకింగ్ యాప్స్, క్యూ అర్ కోడ్ వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. నగదు రహిత లవాదేవీల నిర్వహణకు, బ్యాంకింగ్ రుణాలు, బీమా పథకాలు, డిపాజిట్ బ్యాంకింగ్ పథకాల ద్వారా ఏ విధంగా లబ్ధి పొందాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఒ నవీన్, యూనియన్ బ్యాంక్ రీజనల్ ఎఫ్‌ఐ ఆఫీసర్ గోపాల్, వేమగిరి బ్రాంచ్ మేనేజర్ వంశీ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ప్రతినిధులు హరి, అనిల్, చిట్టితల్లి, జ్యోతి, కడియం ఎపిఎం నాగలక్ష్మి పాల్కొన్నారు.

కార్టూ'నిజం'



భూగర్భ జలాల శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన భూగర్భ జల స్థిరత్వ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా శుక్రవారం ముగిసింది. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ ఎన్.జ్యోతి కుమార్, గోదావరి రీజన్ లో వాటర్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, భూగర్భ జలాలు పెంపొందించే మార్గాలు, క్షేత్రస్థాయిలో వాటర్ లెవిల్ మోనటరింగ్ విధానాలు, నీరు కాలుష్యం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాజీ ఐఎఫ్‌ఎస్ ఎం.సత్యనారాయణ 'వాతావరణ మార్పులు - భూగర్భ జలాల మార్పులు' అనే అంశంపై మాట్లాడారు. ప్రభుత్వం భూగర్భ జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జియోసైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సౌత్రన్ రిజన్ హైదరాబాద్ వారిచే మూడురోజుల టైర్-2 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.



మాట్లాడుతున్న జ్యోతికుమార్

దీనిలో "గ్రౌండ్ వాటర్ సస్టైనబుల్ అండ్ మేనేజ్‌ంట్ ఇన్ ఈస్ట్ గోదావరి" అనే అంశంపై ప్రముఖులు చర్చించారని చెప్పారు. అనంతరం విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, జియో సైన్సెస్ విభాగ అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ .పి.విజయనిర్మల, జియోసైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ నూకరత్నం, డాక్టర్ కెఎస్.పీటర్, డాక్టర్ కె.సుధారాణి, డి.తేజ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సమక్షంలో గోకవరానికి చెందిన పలువురు ముస్లిములు షేక్ మదీనా సాహెబ్, ఎస్‌కె సాహెబ్, ఎస్‌కె శ్రీమదీనా. శ్రీను, ఎస్‌కె ఫిరోజ్ ఆలీషా, మహ్మద్ అలీ, పకీర్ మహ్మద్, ఎస్‌కె పాపసాహెబ్, ఎస్‌కె.రజక్వల్లి, ఎస్.కె మదీనా తదితరులు, వైసిపి నాయకులు వెలిశెట్టి శివ, పదిలం సూరిబాబు శుక్రవారం టిడిపిలో చేరారు. వీరందరికీ ఎంఎల్ఎ నెహ్రూ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ వైసిపికి చెందిన పలువురు కుటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.భద్రం, పిల్ల చంటిబాబు, ఎస్.బాబు, గుబ్బలమ్మ గుడి చైర్మన్ ఆచంట రాజు, పోసిన ప్రసాద్, గోకవరం టౌన్ ప్రెసిడెంట్ పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కమిటీ అధ్యక్షులు గునిపే భరత్, ఎం.వీరబాబు, జి.సన్యాసిరావు, వి.వీరబాబు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన ముస్లిములతో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం. మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద గంజాయి ఉందన్న విశ్వసనీయ సమాచార మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 470 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26 సాయంత్రం రాజమండ్రి డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ తెలిపారు. బదిలీ పొందిన ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో జరుగుతున్న తాత్సారం, తలకు మించిన బోధనేతర కార్యక్రమాల రద్దు వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

డ్రై డే ఫ్రైడేపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి, ఆశ వర్కర్లు గ్రామంలో పర్యటించారు. మలేరియా, విషజ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పూల కుండీలు, టైర్లు, నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడాలని, కలుషితమైన నీటి నిల్వల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహనా కల్పించారు. ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవాలని, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చాగల్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మనోజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రీ సర్వేపై గుడ్డిగూడెంలో గ్రామసభ

ప్రజాశక్తి - గోపాలపురం

రీ సర్వేలో అభ్యంతరాలు ఉంటే 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ కె.అజయ్ బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని గుడిగూడెం గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. దీనిపై శనివారం ఉదయం 10 గంటలకు గుడ్డిగూడెంలో సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తామ న్నారు. సచివాలయం వద్ద డ్రాఫ్ట్ ఆర్ఒఆర్ పబ్లికేషన్ చేస్తామన్నారు.

జాయింట్ భూములను విభజించుకునే అవకాశం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు, తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునేందుకు 2025 డిసెంబర్ 31 వరకు అవకాశం కల్పించారని తహశీల్దార్ కె.అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ విభజన కోసం సాధారణంగా వసూలు చేసే రూ.500 రుసుమును పూర్తిగా మాఫీ చేశారన్నారు. భూ యజమానులు కేవలం రూ. 50 నామమాత్రపు దరఖాస్తు రుసుమను గ్రామ సచివాలయంలో చెల్లించి, ప్రభుత్వం జీవో ఆర్ టి నెంబర్ 755 ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రత్యేక అవకాశం ద్వారా జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదు చేసుకుని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతను పొందొచ్చన్నారు.

పెరవలి : మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ లాండ్ 2.0 లాగిన్ లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులు తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునేందుకు డిసెంబర్ 31 వరకు అవకాశం ఉన్నదని తహశీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రైనింగ్ ఎస్ఐ విధుల్లో చేరిక

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు పోలీస్ స్టేషన్‌లో 15 రోజుల ట్రైనింగ్ నిమిత్తం ప్రొబేషనరీ ఎస్ఐ డి.ఆంజనేయులు బాబు శుక్రవారం విధుల్లో చేరారని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. జిల్లాకు నూతనంగా 15 మంది ఎస్ఐలకు ట్రైనింగ్ కోసం వచ్చారన్నారు. ఇందులో భాగంగా ఆంజనేయులు చాగల్లుకు వచ్చారన్నారు. 15 రోజులు పాటు ఆయన వివిధ విభాగాల్లో శిక్షణ పొందుతారన్నారు.

ముళ్లపూడికి శతాబ్ధకాల గౌరవ పురస్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తణుకులోని ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్‌కు శతాబ్ద కాల గౌరవ పురస్కారంను సుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి అందుకున్నారు. నరేంద్రనాత్ భారతీయ చక్కెర, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, పురోగతికి ఆయన జీవితకాల అంకిత భావానికి అత్యుత్తమ సహకారానికి, అచంచలమైన నిబద్ధతకు గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ నెల 24న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 83వ సుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెంటినియల్ కన్వెన్షన్‌లో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

నేడు ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెరవలి

మండలం ఖండవల్లి గ్రామంలో ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌కు నేడు శంకుస్థాపన జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొంటారని టిడిపి మండల అధ్యక్షులు అతికాల రామకృష్ణమ్మ (శ్రీను), డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రవివర్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొడ్డు రామాంజనేయులు తెలిపారు ఈ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు విధిగా హాజరు కావాలన్నారు.

రహదారులు ఇలా.. రాకపోకలు ఎలా?

గ్రావెల్ రహదారికి నోచుకోని కరకట్ట
వర్షాలు, వరదలు సమయాల్లో లంక గ్రామాల ఇక్కట్లు

ప్రజాశక్తి- మామిడికుదురు

లంక గ్రామాలను ఆనుకుని వైన తేయ నదీ తీరంలో ఉన్నకుడి కరకట్టను విస్తరించిన తుది దశ పనులు పూర్తి చేయకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరకుండా పోయింది మట్టి మార్గం కాస్త వర్షంతో బురదమయముగా మారుతుండడంతో వర్షాలు, వరదలు సమయాలలో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వాటిపైన వేసవిలో రాకపోకలకు ఇబ్బందులు లేకపోయిన వర్షాలు ఆరంభం కావడంతో వెతలు మొదలయ్యాయి కరకట్ట దిగువనున్న పెదపట్నం,పెదపట్నం లంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడి పల్లవ పాలెం, పాశర్లపూడిలంక ప్రాంతాలలో కరకట్ట నానుకుని ఉన్న ఆ ప్రాంత వాసులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు కరకట్టపై


బుర్రదమయంగా మారిన పెదపట్నం కరకట్ట రహదారి

బురదతో, కల్వర్టుల పైకి మట్టి జారిపోతుండటంతో వాహనాలు జారీపోయి దుర్భర దుక్షితి నెలకొంది గ్రావెల్ రోడ్ వేసి రాకపోకలకు ఇబ్బందులు లే కుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాంత వాసులు ప్రజాపతినిధులుకు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

మండల కేంద్రానికి చేరే మార్గమేది...



అప్పనపల్లి బాడవ వాసులు, పెదపట్నం రాకపోకలు సాగించాలన్న ఈ రెండు ప్రాంతాల వాసులు మండల కేంద్రమైన మామిడికుదురు రావాలన్న కరకట్ట బురద మయం గా మారడంతో అవస్థ పడుతున్నాం పెదపట్నం వెళ్లాలంటే మామిడికుదురు నగరం మీదుగా సుమారు ఆరు కి.మీ చుట్టూ తిరిగి అవస్థ పడుతున్నాము కరకట్టపై కిలోమీటర్ మేర గ్రావెల్ రోడ్డు నిర్మిస్తే దురాబారం మరింత తగ్గుతుంది ప్రజాప్ర తినిధులు కరకట్టపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి దృష్టి సారించాలి. **-కంకిపాటి హేమంతరావు, అప్పనపల్లి బాడవ**

మండల కేంద్రానికి రాకపోకల అవస్థలు



పెదపట్నంలంక, అప్పనపల్లి, బి దొడ్డవరం ప్రాంత వాసులు మండల కేంద్రమైన మామిడి కుదురుకు రావాలంటే అప్పనపల్లి బాడవ రహదారి దగ్గర మార్గం. ఈ రహదారిలో కాజ్ వే వద్ద నుంచి కరకట్ట పై వంతెన వరకు సుమారు 200 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మిస్తే మూడు లంక గ్రామాల ప్రజలకు అవస్థ తప్పుతుంది. కరకట్ట నుంచి దిగే ర్యాంపు బురదమయంగా మార డం తో వాహనాల జారిపోయే ప్రమాదాలు ఉంది. ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డు నిర్మాణము పై దృష్టి సారించాలి. **-మేడేపల్లి చిన్న సత్యనారాయణ, అప్పనపల్లి**

ప్రజాపతినిధులు దృష్టి సారించాలి

నాగులంక నుంచి గోగన్నమఠంశివారువరకు వైనతేయ కుడికరకట్ట సుమారు 29 కిలోమీటర్ల విస్తరించి ఉందిఇందులో 20 కిలోమీటర్లు మేర ఆధునీకరించారు పెదపట్నం, పాశర్లపూడి శ్రీరామ్ పేట, పాశర్లపూడి లంక, లూటుకుర్రు ఆదుర్రు ప్రాంతాలలో మధ్య మధ్యలో కొంతమేర సమాంతరముగా గట్టు నిర్మించాల్సి ఉంది దీనికితోడు పలుచోట్ల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాల్సి ఉంది విస్తరణ పూర్తయిన చోట్ల గ్రావెల్ తో రహదారులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉన్న కరకట్ట మధ్యలో అక్కడక్కడ విస్తరణ పనులు చేపట్టకపోవడంతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు పనులు నిలిచిపోయాయి ప్రజా ప్రయోజనం లేని ఆదురు నుంచి నుంచి గోగన్నమఠం వరకు మాత్రమే గ్రావెల్ రోడ్డు వేశార. ఈ రోడ్డుకిరువైపులా తుమ్మ చెట్లు మూసి వేయడంతో ఆ దారి కూడా ప్రయోజనం లేకుండా పోయింది. పలుచోట్ల గట్లు దిగజారిపోతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలన్నీ కరకట్ట మీదుగానే జరుగుతున్నాయి. వర్షాలకు బురదమయంగా మారింది. వర్షాలు ఇలాగే ఉంటే ఇది నడవడానికి కూడా పనిచేయదని ప్రజలు వాపోతున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాలి..

వరద ఉదృతి ఎక్కువగా ఉంటే లంక గ్రామాల వరద బాధితులు తమ పశువులను కరకట్ట పైకి తరలించాల్సి ఉంది కరకట్ట బలోపేతానికి అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పెదపట్నం నుంచి లూటుకుర్రు శివారు బాడి లంక మీదుగా ఆదుర్రు వరకు విస్తరించిన 12 కిలోమీటర్ల మేర ఏటుగట్టు పై ఎక్కడా రోడ్డు సౌ క ర్యా న్ని ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వర్ష కాల సీజన్ 4 మాసాలు రాకపోకలు స్తంబించి పోయి లంక వాసులకు అవస్థలు తప్పడం లేదు.


కరకట్ట నుంచి అప్పనపల్లి బాడవ వెళ్లే రహదారిలో కరకట్ట ర్యాంపు

రావులపాడు హైస్కూల్లో నో బ్యాక్ బెంచ్

ప్రజాశక్తి- రావులపాలెం

రావులపాడు హైస్కూల్ ఉన్నత పాఠశాలలో బ్యాక్ బెంచ్ ఆనవాయితీకి స్వస్తి పలికి యు ఆకారంలో మార్చే విధానాన్ని శుక్రవారం ప్రారంభించారు. సాధారణంగా సరిగ్గా చదవని అల్లరి బాగా చేసేవారిని బ్యాక్ బెంచ్ లో కూర్చుండ బెట్టే ఆనవాయితీకి స్వస్తి చెప్పి ఆధునిక కాలంలో వినూత్నంగా ఆలోచిస్తున్నారు ఉపాధ్యాయులు. విద్యార్థులు కూర్చేనే బెంచీలు యు ఆకారంలో మార్చే పద్ధతి మొదలుపెట్టారు. గతంలో ఇదే తరహా క్లాసులు కేరళలో మొదటి ప్రయోగంగా చేపట్టగా అది మంచి రిజల్ట్ తీసుకొస్తే ఇటీవల కాలంలో తిరుపతి జిల్లాలో ఈ తరహా ప్రయోగం చేసి సక్సెస్ అయ్యారు. ఈ విధానం ద్వారా బ్యాక్ బెంచ్ అనే విధానం కు స్వస్తి చెప్పి యు ఆకారంలో విద్యార్థులను సిట్టింగ్ ఏర్పాటు చేసి విద్యాబోధనను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నామని తద్వారా మంచి ఫలితాలు రాబడతామని దీంతో విద్యార్థులు మానసిక పరిస్థితిని తెలుసుకొని అందరితో సమానంగా పోటీపడి చదివేటట్లు వినూత్న తరహా ప్రయోగం చేపట్టామని హెచ్ఎం మధుసూదనరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా యు ఆకారంలో సిట్టింగ్ ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ తరహా విద్యాబోధన మంచి ఫలితాలను ఇస్తుందనడంలో సందేహం లేదని మండల పరిధిలోని అన్ని పాఠశాలలో త్వరలోనే ఈ తరహా విద్యాబోధనకు ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్ట సత్యవతి బాబ్జి ఉపాధ్యాయులు కెవి.శేఖర్, జివి.గిరి, జ్యోతిబసు, సత్యవతి, శ్యామల, వీరవేణి, మేరీ జోన్స్, ఆంజనేయులు, సుజాత, వెంకటలక్ష్మి, గోపాలకృష్ణ, పద్మజ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


నో బ్యాక్ బెంచ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కపిలేశ్వరపురం మండలం నేలటూరు గ్రామంలో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా జల్ జీవన్ మిషన్ గ్రాంటు రూ.66.62 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్లు సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ ను, 2500 మీటర్లు మేర హెచ్‌డిపిఇ పైపు లైన్లు, 250 ట్యాప్ కనెక్షన్లను, ఎంఎల్ఎ వేగుళ్ల ప్రారంభోత్సవం చేశారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


నేలటూరులో ట్యాప్ కనెక్షన్లను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

'పళ్ల స్వామి' ఛైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పళ్లస్వామి రిటీస్ ఛైర్‌పర్సన్‌గా పళ్ల వెంకటలక్ష్మి శుక్రవారం స్వీకారం చేశారు. మండలంలోని పల్లవారిపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పళ్లస్వామి చారిటబుల్ ఛైర్‌పర్సన్‌గా పళ్ల వెంకటలక్ష్మి, పాలకవర్గంచే దేవాదాయ శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గంగాభవాని, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, గుద్దటి జమ్మి, తాడి నరసింహారావు, దాట్ల పృథ్వీరాజు, చిక్కాల అంజిబాబు, దంగేటి శ్రీనివాస్, గుద్దటి వీరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎంఎల్ఎ సుబ్బరాజు

గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌గా శకుంతల

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్‌గా పాటి శకుంతల శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపల్‌గా భాధ్యతలు నిర్వహించిన గంగా భవాని బదిలీపై జంగారెడ్డి గూడెం గురుకుల పాఠశాలకు వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి ప్రిన్సిఫల్‌గా శకుంతల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ నల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ దాకే స్వరూప, మాజీ ఛైర్మన్ వడ్డి శ్యామ్‌ప్రసాద్, వీధి చంటిబాబు, ఎంవి.సూర్యం, కొండేపూడి చంద్రశేఖర్, అన్నవరం, ఎన్‌వి.సత్యనారాయణ, జి.శ్రీనివాస్, కె.కిరణ్ కుమార్, డి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌ఛార్జి శకుంతలకు సత్కారం

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్

జె బ్రాండ్ లిక్కర్‌తో పెరిగిన లివర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య
రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి పాలనలో కల్తీ మద్యంతో జగన్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని జె బ్రాండ్ల చీప్ లిక్కర్ వల్ల మద్యం సేవించిన ఎన్నోవేల మందికి లివర్ చెడిపోయిందని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గత సర్కారు హయాంలో తాగిన చీప్ లిక్కర్ వల్లే లివర్ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరిగిందని వైద్యులు సైతం చెబుతున్నారన్నారు. ఆర్యాపురం టింబర్ మర్చంట్స్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక తాను ఇంతవరకు 149 మందికి సిఎం సహాయ నిధి ద్వారా రూ.1,99,17,774 చెక్కులు పంపిణీ చేశామని ఇప్పుడు 23 మందికి రూ.11,65,449 విలువ చేసే చెక్కులను అందించానన్నారు. మొత్తం 172 మందికి రూ. 2,10,83,223 అందించామని ఆయన వివరించారు. పెండింగ్‌లో ఉన్న మరో 64 మందికి రూ. 2,55,72,710 అందించాల్సి ఉందన్నారు. వీరిలో లివర్ వ్యాధి గ్రస్తులే ఎక్కువ మంది ఉన్నారాన్నరు. దీనిని కారణం జగన్ పాలనలో గత ఐదు సంవత్సరాలుగా ఏపీలో కల్తీ మద్యం విక్రయాలేనని ఆయన అన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్న మాటలు కాదని, రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారని ఆయన తెలిపారు. జగన్‌కు స్కాంలు కొత్త కాదని, మద్యం నగదు అమ్మకాలు జరిపి దోపిడీకి పాల్పడ్డారని, ఇది దేశంలోనే అతి పెద్ద మద్యం స్కాం అన్నారు. లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారని, ఆయనకు కల్పించిన సదుపాయాలు చూస్తే అతను ఏదో పిక్నిక్‌కు వచ్చినట్లుగా ఉందని విమర్శించారు. వర్షాలకు నగరంలో రోడ్లు గుంతలు పడ్డాయన్నారు. త్వరలోనే వీటిని పూడుస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పుస్తక నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి-కడియం

కడియం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ, మండల సమాఖ్యలకు సంబంధించి శుక్రవారం సెర్ప్ అధికారులు ఆడిట్ నిర్వహించారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌విఎస్.మూర్తి ఆడిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పుస్తక నిర్వహణ సంఘాలకు ప్రాణం వంటిదన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ జయచంద్ర, డీపీఎమ్ (ఫైనాన్స్) ఎమ్ . శ్రీనివాసరావు, ఎపిఎం ఎ.నాగలక్ష్మి, సిసిలు తదితరులు పాల్గొన్నారు.